సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 2 । మార్చి । 2025

రంజాన్ వేళలు	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహర్ సోమ॥ (ఉ॥)
కడప	: 6.29	5.15
పులివెందుల	: 6.31	5.20
ప్రొద్దుటూరు	: 6.30	5.19



'సూపర్ సిక్' అయిన పథకాలు

అనేక హామీలు గుప్పించి అధికార పీఠంపై కూర్చున్న చంద్రబాబు.. ఇప్పటి వరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అన్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.0/20.4

వాతావరణం

జిల్లాలో శనివారం 20.4 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు కబడ్డీ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడపజిల్లా సబ్ జూనియర్స్ బాల బాలికల కబడ్డీ ఎంపికలను ఆదివారం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని ప్రెసిడెంట్ రవీంద్రారెడ్డి, సెక్రటరీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు 16 ఏళ్లు కలిగి 55 కేజీల బరువులోపు ఉన్న బాలబాలికలు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9133480661, 9949304160 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

5 నుంచి ఒంటిమిట్టలో మహాసంప్రోక్షణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. ఒంటిమిట్ట ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ మరమ్మతులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు బాలాలయం నిర్వహించామన్నారు. భారత పురావస్తుశాఖ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ) ఆధ్వర్యంలో ఆలయంలో పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తి కావచ్చాయని, మార్చి 5 సాయంత్రం 5.30 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తు హోమం, అంకురార్పణ జరుగుతుందన్నారు. మహాసంప్రోక్షణ సందర్భంగా మార్చి 6 ఉదయం 7.30 గంటలకు భగవత్పుణ్యాహం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తారు. 9 వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయి.

పౌరసరఫరాల సంస్థ గోడౌన్ తనిఖీ



గోడౌన్‌ను పరిశీలిస్తున్న పౌరసరఫరాల సంస్థ ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ వాణి రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్: స్థానిక బొల్లవరంలోని పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌ను శనివారం ఆ సంస్థ ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ వాణి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లోని రికార్డులను పరిశీలించి అక్కడ నిల్వ ఉన్న బస్తాలను పరిశీలించారు. నెలవారి తనిఖీల్లో భాగంగా గోడౌన్ సందర్శించారు. గోడౌన్‌లో బస్తాలు విప్పి బియ్యం కింద పోయడాన్ని, బస్తాలు లెక్కించేందుకు వీలు లేకుండా ఉండటాన్ని చూసి ఆమె అసహనం వ్యక్తం చేశారు. లారీల నుంచి బస్తాలను గోడౌన్‌లో దింపకుండా చౌక దుకాణాలకు వెళ్లే కాంట్రాక్టు లారీలలో హమాలీలు లోడ్ చేస్తుండటాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప నుంచి వచ్చిన లారీల నుంచి బస్తాలను గోడౌన్‌లో హమాలీలు అన్‌లోడ్ చేయాలన్నారు. హమాలీలకు ఆన్‌లోడ్ కూలి, లోడ్ కూలి ప్రభుత్వం ఇస్తుందన్నారు. గోడౌన్‌లో మొత్తం 42 మంది హమాలీలు పని చేయాల్సి ఉండగా కేవలం 15 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. ఇలా తక్కువ మంది హాజరై పని కావాలంటే ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ లింగస్వామి పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఎన్నిక ప్రశాంతం



జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నాయకులను అభినందిస్తున్న నాగేశ్వర్ రావు

కడప అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. శనివారం కడపలోని వ్యవసాయ అధికారుల సంఘం భవన సమావేశ మందిరంలో సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడిగా సి. పద్మావతి(ఏవో, జీవ నియంత్రణ ప్రయోగశాల కడప) ఉపాధ్యక్షుడిగా జీపీ ఓబులేసు (ఏవో, పెండ్లిమర్రి), కార్యదర్శిగా బి. క్రిష్ణ సుమంత్‌రెడ్డి(ఏవో, కడప ఏడీ కార్యాలయం), సంయుక్త కార్యదర్శిగా శ్యాంబాబు (ఏవో, వీఎన్‌పల్లి), కోశాధికారిగా పట్నం పద్మజ (ఏవో, ఊటుకూరు రైతు శిక్షణ కేంద్రం), గౌరవాధ్యక్షుడిగా నాగరాజు (బద్వేల్ ఏడీ)లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు బాల భాస్కర్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కోశాధికారి మురళీ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా వ్యవసాయ అధికారుల సంఘానికి అభినందించారు.

గంగమ్మ జాతర.. జనసంద్రమాయెరా





ప్రత్యేక అలంకారంలో అనంతపురం గంగమ్మ తల్లి, భక్తులతో కిటకిటలాడుతున్న గంగమ్మ ఆలయ ప్రాంగణం

- అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన లక్షలాదిమంది భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చాందినీ బండ్లు

లక్కిరెడ్డిపల్లి: రాయలసీమ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన అనంతపురం గంగమ్మ జాతర శనివారం వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో జాతరో... జాతర అన్నట్టు అనిపించింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.కోరిన కోర్కెలు తీర్చే తల్లీ..కరుణించి కాపాడవమ్మా అంటూ అనంతపురం గంగమ్మను భక్తులు వేడుకున్నారు.

ఊరూరా బోణాలతో మొక్కులు చెల్లింపు....

కస్తూరిరాజుగారిపల్లి గ్రామం, చాగల గుట్టపల్లె అమ్మవారిని అర్ధరాత్రి సమయంలో ఆరుబయట ఉంచారు. సంప్రదాయబద్ధంగా పి కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులు మొదటి బోనం సమర్పించారు. జాగారానికి తరలిన భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొడుతూ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. రఘునాథ రెడ్డి మేనల్లుడు వాసు బోర్వెల్స్ నాని ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయడంతో జాగారానికి వచ్చిన భక్తులు ఉత్సాహంగా చిందులు వేశారు. తెల్లవారుజామున మూడు గంటలకు బయలుదేరిన అమ్మవారి ఊరేగింపు అప్పలరాజుగారిపల్లి, మర్లవాండ్లపల్లి,మర్రిచెట్టు, చౌటపల్లి గ్రామాల మీదుగా సాగింది.మహిళలు సంతానం



జాతరలో చాందినీ బండి

కోసం అమ్మవారికి వరపడ్డారు. లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. చాందినీ, కుంకుమ బండ్లు భక్తులను ఆకట్టుకున్నాయి.. జాతరలో ఏర్పాటు చేసిన చెక్కభజన, కోలాటం, ఆర్కెస్ట్రా, జబర్దస్త్, రేలారేలా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు యువతను ఉర్రూతలూగించాయి. ఈ సంవత్సరం రూ.300 దర్శనాన్ని ఏర్పాటు చేశారు. కానాల గంగిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జాతరలో ఎన్నడూ లేనంత విధంగా మిఠాయి, శీతలపానీయాల దుకాణాలు, చెరుకు రసాల బండ్లు ఎక్కువగా కనిపించాయి. తెలంగాణ డప్పు వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి. డీఎస్పీ కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ రవీంద్రబాబులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు 25 ట్యాంకర్లను ఏర్పాటు చేసి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. 32 సీసీ కెమెరాలు నిఘాలో జాతరను పోలీసులు పర్యవేక్షణ చేపట్టారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

డీఈఓ షేక్ షంషుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 17 నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చీఫ్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు కృషి చేయాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో పది పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతోపాటు ఎంఈఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి అవకతవకలకు చోటివ్వకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఆరోపణలకు తావు లేకుండా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. దీంతోపాటు పరీక్షా కేంద్రాలలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రశ్నపత్రాలను సకాలంలో అందించి మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. డిప్యూటి ఈఓలు రాజగోపాల్‌రెడ్డి, మీనాక్షి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో చీఫ్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లదే కీలకపాత్ర అన్నారు. ఎంఈఓలు కూడా పర్యవేక్షించాలన్నారు. డీసీఈబీ సెక్రటరీ విజయ భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ సాంబశివారెడ్డి, ఎగ్జామినేషన్ సెక్షన్ అసిస్టెంట్ రమేష్‌తోపాటు చీఫ్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్ష



కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సంబంధిత పరీక్షలు 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు కూడా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. వీరి కోసం జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. 37 పరీక్షా కేంద్రాలలో 6523 మంది అభ్యాసకులు పరీక్షలను రాయనున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యాసకులు తమ హాల్‌టికెట్లను సంబంధిత ఏ1 సెంటర్ నుంచి లేకుంటే ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటి ధికారక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని హాజరుకావచ్చు.



ఓపెన్ స్కూల్ అభ్యాసకులు

అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం



ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందు కోసం జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశాము. అభ్యాసకులంతా నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

– డాక్టర్ షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



కడపలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

- జిల్లావ్యాప్తంగా 96 శాతం హాజరు నమోదు
- పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్‌ఐవో, డీవీఈఓ

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శనివారం ప్రథమ సంవత్సరానికి సంబంధించి తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని వసతులను కల్పించారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 64 పరీక్షా కేంద్రాలలో తొలిరోజు 17906 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 17196 మంది హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా జనరల్, ఒకేషన్‌కు సంబంధించి అన్ని పరీక్షా కేంద్రాలకుగాను 96 శాతం హాజరు నమోదైంది.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్‌ఐవో, స్క్వాడ్స్, డీఈసీ సభ్యులు

కడప నగరంలోని గాయత్రి, నారాయణ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య కళాశాలలను ఇంటర్ ఆర్‌ఐవో బండి వెంకటసుబ్బయ్య తనిఖీ చేసి పరీక్షా సిబ్బందికి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అలాగే డీఈసీ సభ్యులు, స్క్వాడ్ బృందాలు జిల్లాలోని బద్వేల్, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, పొద్దుటూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, వెంపల్లి, సింహాద్రిపురం మండలాలలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రాధాన్యతా రంగాలను పటిష్టం చేసి గ్రామాల ఆర్థిక పరిపుష్టితోపాటు రైతులను లాభాల బాటలో నడిపించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడవాలంటే అన్ని ప్రాధాన్యతా రంగాల శాఖలు సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ముందుగా అన్ని గ్రామాల్లో సామాజిక స్థితిగతులు, ఆర్థిక స్థితిగతులు, అక్కడ అందుబాటులో ఉన్న వనరులు, వనరులను సద్వినియోగం చేసుకునేందుకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలెట్ గా ఎంపిక చేసి 100 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రారంభించాలన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వీరపునాయునిపల్లె మండలంలోని కృష్ణంపల్లె గ్రామాన్ని ఎంపిక చేశామని, అందులో భాగంగా ఆ గ్రామంలో అన్ని ప్రధాన్యత రంగాలకు సంబంధించి అన్ని రకాల వనరులను సద్వినియోగం చేస్తూ ఆ గ్రామానికి ఆర్థిక పరిపుష్టి చేకూర్చడం జరుగుతుందన్నారు. జిల్లాలో మరో ఏడాదిలోపు ఒక్క లక్ష ఎకరాలను సాగులోకి తేవాలని, ఉద్యాన పంటల సాగుకు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఫారం పాండ్ ఏర్పాటు చేసే ప్రతి పొలంలో కొన్ని ఉద్యాన మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి ఒక సరికొత్త ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి 1వ తేదీ నుండి మార్చి 30వ తేదీ వరకు పశుసంవర్ధక శా అధికారులు చేపట్టే కార్యక్రమాలపై రూ పొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రాజెక్టుల ఎస్‌ఈ వెంకట్రామయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్‌శారదమ్మ, సీఎస్‌ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, ఏపీఎంఐపీ పీడి వెంకటేశ్వర రెడ్డి, డిసిఓ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించి తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రిజర్వాయర్ల ద్వారా సుస్థిరమైన సురక్షిత తాగునీరు అందించేందుకు తలపెట్టిన ప్రాజెక్టుల ప్రణాళికల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. తెలుగుగంగ ఎస్ ఆర్-1, బ్రహ్మ సాగర్, మైలవరం, గండి కోట,చిత్రావతి రిజర్వాయర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 55 ఎల్‌పీసీడీ , పట్టణ ప్రాంతాల్లో 135 ఎల్‌పీసీడీ శాశ్వత ప్రాతిపదికన తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

వరాలమాసం వచ్చేసింది!

- కనిపించిన నెలవంక
- మొదలైన తరావీ ప్రత్యేక ప్రార్థనలు
- భక్తిపారవశ్యంలో ముస్లింలు

కడప కల్చరల్: వరాల వసంతం వచ్చేసింది. ప్రపంచంలోని ముస్లింలందరూ అత్యంత పవిత్రమైనదిగా భావించే రమజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో జిల్లాలో తరావీహ్ ప్రార్థనలు మొదలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున సహరీ చేసి ఉపవాసాలు ప్రారంభించారు.

రమజాన్...ఈ పేరు వినగానే ముస్లింలు భక్తి, గౌరవాలతో పులకించిపోతారు. ఈ మాసం వారికి అత్యంత పవిత్రమైనది. దీని నిర్వహణ కోసం ముస్లింలు సర్వశక్తులు కూడగట్టుకుంటారు. సంప్రదాయంగా నిర్వహించుకునేది ముస్లింలే అయినా ఇతర మతాల వారిని కూడా ఈ మాసం ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా ముస్లిమేతరుల్లో ఐదు నుంచి ఎనిమిది శాతం మంది ఈ మాసంలో కనీసం ఒకరోజు నుంచి వారం, రెండు వారాలపాటు రోజా (ఉపవాసం) ఉంటారు. దీంతో ముస్లింలతోపాటు తమకు కూడా దైవం శుభాలనిస్తాడని విశ్వసిస్తున్నారు. ఈ మాసాన్ని నిజానికి ముస్లిమేతరులు ఇంతగా అభిమానించడానికి కారణం ఇందులోని ఉత్తమ గుణాలే. మనిషిగా ఈ గుణాలను పెంపొందించుకుంటే అటు ఆత్మశాంతి, ఆరోగ్యం, దేవుని కృప, కటాక్షాలు లభిస్తాయన్న నమ్మకంతోనే ఈ మాసాన్ని మనసారా ఆహ్వానిస్తున్నారు.



విద్యుద్దీపాలంకరణలో ప్రొద్దుటూరులోని జామియా మసీదు

- రంజాన్ మాసం ప్రారంభమవుతోందన్న సూచనగా శనివారం నెలవంక కనిపించింది. ముస్లింలు నెలవంకను దర్శించుకుని పవిత్ర మాసాన్ని ప్రసాదించినందుకు దైవానికి ధన్యవాదాలు చెప్పుకున్నారు. ఉపవాస దీక్షలకు సిద్ధమయ్యారు. ఆదివారం నుంచి దీక్షలు మొదలయ్యాయి. అంతటా భక్తిభావం నెలకొంది. సెహరీలు, ఇఫ్తార్ విందులతో సందడితోపాటు ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలతోపాటు మసీదుల వద్ద సందడి నెలకొంది.

» పేద, ధనిక తేడా లేదు




ఉపవాసం కోసం కుటుంబ సభ్యులు చేసే ఏర్పాట్లతో ప్రతి ముస్లిం ఇల్లు హడావుడితోపాటు ఆధ్యాత్మిక భావనలతో విలసిల్లుతుంది. వీలైనంత వరకు ఈ మాసానికి అవసరమైన నిత్యావసర సరుకులను ఒకేమారు తెచ్చుకుంటారు. ఇందులో పేద, ధనిక తేడా ఉండదు. రోజు కూలీ నుంచి అత్యంత ధనవంతుడు సైతం ఖచ్చితంగా ఉపవాస దీక్షను పాటిస్తారు.

ప్రారంభం...ముగింపు

ఉపవాసాల ప్రారంభాన్ని సెహరీ అని, ముగింపును ఇఫ్తార్ అని వ్యవహరిస్తారు. ప్రతిరోజు ఈ రెండు కార్యక్రమాల నిర్వహణ గురించి నెల రోజుల ముందే ప్యాకెట్ క్యాలెండర్లు, ప్రధానంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా ఖచ్చితమైన సమయాలను తెలుసుకుని పాటిస్తున్నారు. ఈ సమయాలను ప్రతి ముస్లిం ఖచ్చితంగా అమలు చేస్తాడు. దీంతో ఈ మాసంలో ముస్లింలకు ఖచ్చితమైన సమయపాలన చేయడం, క్రమశిక్షణాయుతంగా జీవించడం, చెప్పిన సమయానికి అనుకున్న పనిని పూర్తి చేయడం అలవాటు అవుతాయి.

» తరావీలు



ఇతర రోజులు చేసే ప్రార్థనల కంటే రంజాన్ మాసంలో నిర్వహించే ప్రార్థనలు కాస్త ఎక్కువగా ఉంటాయి. ప్రతి ముస్లిం తప్పనిసరిగా తరావీ నమాజ్‌లు ఆచరించాల్సి ఉంటుంది. రోజా ఉపవాస దీక్ష విరమించాక మసీదుల్లో రాత్రి 8.30 గంటల తర్వాత తరావీ ప్రార్థనలను ప్రారంభిస్తారు. ప్రాణప్రదంగా భావించే పవిత్ర ఖురాన్ గ్రంథంలోని భాగాలను ప్రతిరోజు కొద్దిభాగం పఠనం, శ్రవణం విధిగా నిర్వహిస్తారు. దీంతో ఆధ్యాత్మిక విషయాల పట్ల అవగాహన అల్లాహ్‌తోపాటు ప్రవక్తలు చూపిన ఉత్తమమైన మార్గాన్ని అనుసరించడం అలవడతాయి.

ఆధ్యాత్మిక మార్గం

ఈ మాసమంతా ముస్లింలు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారు. వినోద కార్యక్రమాలలో కూడా పాల్గొనరు. సినిమాలకు వెళ్లరు. జల్సాలకు కూడా దూరంగా ఉంటారు. వీలైనంత వరకు నమాజు, తజ్బీ, దువా తదితర ఆధ్యాత్మిక చింతనతోనే గడుపుతారు.

ఇవ్వడంలో సంతోషం

మనిషికి ఎంత ఆస్తి ఉన్నా తృప్తి ఉండదు. దాన్ని సాధించాలంటే తాను కూడా ఇతరులకు ఇవ్వడం అలవాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని ఆస్వాదించాలి. ఆ అలవాటు చేసేందుకే ముస్లింలలో ఈ పవిత్ర మాసం సందర్భంగా జకాత్, ఫిత్రా సంప్రదాయాలను విధిగా పాటిస్తారు. ఈ మాసంలో జకాత్ చెల్లించడంతో పుణ్యం 70 రెట్లు ఎక్కువగా లభిస్తుందన్నది ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఏడాది సంపాదనలో జకాత్‌ను వీలైనంత వరకు మూడవ వారం నుంచి పేదలకు ఇవ్వడం ప్రారంభిస్తారు. ఫిత్రా మాత్రం పండుగ నమాజ్‌కు వెళ్లే ముందు చెల్లిస్తారు. ఈ నియమం ద్వారా తమకు ఉన్నంతలో పేద వారికి, అవసరమున్న వారికి సహాయం చేసే గుణం అలవడుతుంది.



క్లుప్తంగా

గండికోటలో సినిమా షూటింగ్



మాధవరాయస్వామి ఆలయ ఆవరణలో షూటింగ్ నిర్వహిస్తున్న కళాకారులు

జమ్మలమడుగు రూరల్ : పర్యాటక ప్రాంతమైన గండికోటలో హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ నిర్వహించారు. సూర్య ప్రొడక్షన్ పతాకంపై పవన్‌కల్యాణ్ హీరోగా క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో సినిమా నిర్మితమవుతోంది. శనివారం గండికోట ప్రాంతంలోని మాధవరాయస్వామి దేవాలయం, కోట ముఖ ద్వారం తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశారు. మాధవరాయస్వామి ఆలయంలో శివలింగం సెట్టింగ్ వేసి సత్యరాజ్ (కట్టప్ప)పై జూనియర్ ఆర్టిస్ట్‌లపై షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అభిమానులు, ప్రజలు తరలివచ్చారు.

పోలీసులకు చిక్కిన దొంగ



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ, పోలీసులు

వేముల : మండల పరిధి వేల్పుల గ్రామంలోని దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి సొమ్ము దోచుకెళ్లిన కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వివరాలు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం మామిళ్లపల్లె గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి వేల్పుల గ్రామంలోని అభయాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్నాడు. అందరూ వెళ్లిన అనంతరం ఎవరూ లేని సమయంలో దేవాలయాలలో ఉన్న హుండీలను పగులగొట్టి వాటిలో ఉన్న సొమ్మును దొంగలించాడు. తర్వాత తొండూరు గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, పులివెందుల పరిధిలోని నామాలగుండు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో హుండీలను పగులగొట్టి సొమ్మును దొంగలించి తప్పించుకు తిరుగుతుండే వాడు. ఈ క్రమంలో కరుణాకర్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసి, అతని వద్ద నుంచి దొంగలించిన సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

అనుమానాస్పదంగా జీవాలు మృతి


సంబేపల్లె : నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం ఎర్రగుంట్ల దళితవాడలో జల్లా అంజలమ్మకు చెందిన 3 పెద్ద ఎనుము లు, 3 దూడలు శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాయి. మేతకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఎనుములు ఇంటికి వచ్చిన తర్వాత మృత్యువాత పడ్డాయి.

మూగ వేదన.. అరణ్య రోదన

- జిల్లాలో కరువు ఛాయలు
- గ్రాసం, నీరు లేక ఇక్కట్లు
- వలస బాటలో జీవాలు
- అష్టకష్టాలు పడుతున్న పోషకులు



దేవపట్ల సమీపంలో లారీలోకి గొర్రెలను ఎక్కిస్తున్న కాపరులు



సంబేపల్లె నుంచి వెంకటగిరికి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన గొర్రెలు, వాహనాలు

సంబేపల్లె : వర్షాభావం పశువులకు శాపంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీలో ఆశించినంత వర్షం కురవ లేదు. పంటలు ఎండిపోయాయి. దీంతో పశుగ్రాసం కరువైపోయింది. కడుపు నిండా మేత లేక పశువులు అల్లాడుతున్నాయి. వాటి బాధ చూడలేక వేరే ప్రాంతాల నుంచి.. గడ్డి కొనడానికి వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. అంత ధర పెట్టి గడ్డి కొనలేక, పశువులను పస్తు ఉంచలేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పశువులు ఉన్న వారి పరిస్థితే ఇలా ఉంటే.. మూగజీవాలను పోషించే వారి కష్టాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వాటిని ఎలాగోలా బతికించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పచ్చిక బయళ్లు ఉన్న కొండ ప్రాంతాల్లోని సమీప ఊర్లకు తీసుకెళ్తున్నారు. కొందరు గొర్రెలు, మేకలను తోలుకుని కాలినడకన వెళ్తున్నారు. మరికొందరు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇంకొందరు కబేళాలో అమ్మేస్తున్నారు. ఏదో ఓ ధరకు అమ్ముకొని గుండె నిండా ఆవేదనతో ఇళ్లకు చేరుకుంటున్నారు.

నీటి కరువు

వేసవి కాలం వస్తోంది. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. పొలాల వద్ద, కొండలు, గుట్టల్లో పచ్చగడ్డి లభించడం లేదు. దీంతో మూగజీవాలకు గ్రాసం దొరకడం గగనమైంది. మండుటెండల తీవ్రతకు భూగర్భజలాలు కూడా అడుగంటిపోయాయి. గుక్కెడు నీరులేక జీవాలు అలమటిస్తున్నాయి. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా కరువు ప్రాంతం. ఏటా ఇక్కడ కరువు ఛాయలు కనిపిస్తుంటాయి. ప్రస్తుతం రాయచోటి నియోజకవర్గంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడిపోషణపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గొర్రెలు 18 లక్షలు, మేకలు 3 లక్షలు, గేదెలు 1 లక్షా 5 వేలు, ఆవులు 2 లక్షల 70 వేలు ఉన్నట్లు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం వీటిని పచ్చిక బయళ్లు ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలోని వారు ఏటా శేషాచలం అటవీ సమీప ప్రాంతాలకు తీసుకెళ్తుంటారు. ఇటీవల సంబేపల్లె మండల పరిధిలోని బోయపల్లె, అన్నప్పగారిపల్లె, శెట్టిపల్లెతోపాటు పలు ప్రాంతాల నుంచి బొలేరో పికప్, లారీలతో గొర్రెలను తిరుపతి జిల్లా వెంకటగిరికి తరలించడమే ఇందుకు నిదర్శనం.

గ్రాసం ధరకు రెక్కలు

ఎండు పశుగ్రాసాన్ని కొనాలంటే పశుపోషకులకు తలకు మించిన భారమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో రబీలో సాగు చేసిన వేరుశనగ కట్టె ట్రాక్టర్ లోడు రూ.20 వేల నుంచి 25 వేల వరకు ధర పలుకుతోంది. వరిగడ్డి ట్రాక్టర్ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంది. ఇంత రేటు పెట్టి పశుపోషకులు గ్రాసాన్ని కొనలేక పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. పాడి రైతుల పరిస్థితి కూడా ఇలాగే వుంది. బోర్ల వద్ద సాగు చేసిన గడ్డిని అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేసుకొంటున్నారు. పాలతో వచ్చిన డబ్బులు గ్రాసానికే సరిపోతే సంసారాలు ఎలా సాగాలని వారు అంటున్నారు. ప్రధానంగా మూగజీవాలను తోలుకొని ఎండకు ఆకో, అలుమో మోపుకొని వస్తే.. దప్పిక తీర్చడం పెను సవాల్‌గా మారింది. అక్కడక్కడా అడపాదడపా పొలాల పైపులైన్ల వద్ద దప్పిక తీర్చు కొంటున్నాయి. గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద నీటి వనరులు వున్న చోట తొట్లను నిర్మిస్తే మూగజీవాలకు ఉపయోగంగా వుంటుంది.

మేత కోసం అగచాట్లు



ఎండలు రోజురోజుకు పెరుగుతున్నాయి. చుట్టుపక్కల ఎక్కడా పచ్చిమోపు కనపడలేదు. మూగజీవాలతోనే బతుకుతున్నాను. మోపుతోపాటు నీరు దొరకడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే వుంటే జీవాలను అమ్ముకోవాల్సిందే. నాకున్న 120 జీవాలను సుదూర ప్రాంతాలకు తరలించాను.

\- రమణ, బోయపల్లె, సంబేపల్లె మండలం

వెంకటగిరికి పోతున్నాం



నాకు 300కు పైగా జీవాలు వున్నాయి. మండుటెండలో ఎటు చూసినా గ్రాసం కనుమరుగైంది. కనీసం మూగజీవాలకు తాగడానికి నీళ్లు కూడా సరిగా దొరకడం లేదు. జీవాలను తోలుకొని కాలినడక ద్వారా వెంకటగిరి దగ్గరకు వెళుతున్నా. ఇక్కడ ఉంటే జీవాలను చంపుకోవాల్సి వస్తుంది.

\- ఆంజనేయులు, సంబేపల్లె మండలం

మా దృష్టికి రాలేదు

జిల్లా వ్యాప్తంగా ఇంత వరకు ఎక్కడా గొర్రెలు, మేకలు గ్రాసం లేక వలస వెళ్తున్నాయని మా దృష్టికి రాలేదు. గ్రామాలలో వున్న జీవాలు అక్కడే ఉన్నాయి. గత నెలలో పశు వైద్య కేంద్రాలు నిర్వహించిన సమయంలో 80 శాతం గొర్రెలకు టీకాలు వేశాం. మండలాల వారీగా పర్యటించి గొర్రెల కాపరులు, పాడిరైతులు పడుతున్న సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

\- గుణశేఖర్ పిళ్లై, పశు వైద్యశాఖాధికారి, అన్నమయ్య జిల్లా

చైన్ స్నాచింగ్ కేసు నమోదు

నిమ్మనపల్లె : మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిప్పేస్వామి తెలిపారు. ముష్టూరు పంచాయతీ వలసపల్లెకు చెందిన ఓబులమ్మ బెంగళూరులో ఉన్న కుమారుడు వాసుదేవరెడ్డి వద్ద ఉంటుంది. పింఛను తీసుకోవడానికి ఫిబ్రవరి 27న బెంగళూరు నుంచి మదనపల్లెకు చేరుకుంది. అక్కడి నుంచి మండలంలోని నిమ్మనపల్లె– మదనపల్లె రోడ్డులోని పట్వారిపల్లె (ముష్టూరు క్రాస్) బస్‌స్టాప్ వద్ద ఇంటికి వెళ్లేందుకు ఎదురు చూస్తోంది. అదే సమయంలో ముష్టూరు వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వేగంగా మహిళ వద్దకు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కోవడానికి ప్రయత్నించారు. ఆమె కింద పడిపోవడంతో, వెనక కూర్చున్న వ్యక్తి బలవంతంగా మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. బంగారు గొలుసు సుమారు 20 గ్రాములు ఉండగా, రూ.1.50 లక్షల విలువ చేస్తుందన్నారు. బాధిత మహిళ కుమారుడు వాసుదేవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాయచోటి టౌన్ : తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును శనివారం ఆశ్రయించారు. కోడూరునగిరిపాడు గొల్లపల్లికి చెందిన నవీన్‌కుమార్, మదనపల్లి బాటవారిపల్లికి చెందిన శిల్పా ప్రేమించుకున్నారు. ఇరువురి కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవడంతో కడపలోని ఆంజనేయస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. అమ్మాయి కుటుంబ సభ్యులు తమను చంపుతామని బెదిరిస్తున్నారని వారు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాము ఇద్దరం మేజర్లమని వివరించారు. తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వారు కోరారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో టీడీపీ కౌన్సిలర్ భర్త అరెస్ట్



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కౌన్సిలర్ రావులకొల్లు అరుణ నాగేంద్ర దంపతులు (ఫైల్)



జమ్మలమడుగు పోలీస్‌స్టేషన్‌లో నాగేంద్ర (వృత్తంలో ఉన్న వ్యక్తి)

ప్రొద్దుటూరు/జమ్మలమడుగు : క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన 40వ వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ భర్త నాగేంద్రను పోలీసులు అరెస్టు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన కౌన్సిలర్.. నంద్యాల వరదరాజులరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రావులకొల్లు నాగేంద్రతోపాటు ఆయన భార్య టీడీపీలో చేరారు. క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి జమ్మలమడుగు పోలీసులు నమోదు చేసిన కేసులో నాగేంద్ర ప్రథమ నిందితుడిగా ఉన్నాడు. జమ్మలమడుగులో డబ్ల్యూపీఎల్‌టీ–20 క్రికెట్ మ్యాచ్‌పై శుక్రవారం రాత్రి బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరుకు చెందిన రావులకొల్లు నాగేంద్ర, ఎస్.మాలిక్‌బాషా, దర్వస్ జమాల్ బాషా, గడ్డం మాలిక్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, ఐదు లక్షల 60 వేల రూపాయలు, క్రికెట్ బెట్టింగ్ పట్టీని స్వాధీనం చేసుకున్నారు. జమ్మలమడుగు అర్బన్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ లింగప్ప వివరాలు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. గతేడాది ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ నాయకులు సీఎం సురేష్ నాయుడు, వీఎస్ ముక్తియార్ సమక్షంలో కౌన్సిలర్ రావులకొల్లు అరుణ, నాగేంద్ర దంపతులు టీడీపీలో చేరారు. ఇటీవలే 19వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మునీర్‌ను మట్కా కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్

పులివెందుల రూరల్ : ఓ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మురళీ నాయక్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లింగాల మండలం దిగువపల్లి గ్రామానికి చెందిన పప్పూరి గంగిరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 24న అరటి తోట వద్ద హత్యకు గురయ్యాడు. ఈ సంఘటనపై మృతుడి పెద్ద కుమారుడు యోగానందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. లింగాల మండలం దిగువపల్లి గ్రామ పొలాల్లోని సర్వే నంబర్ 132–పీ1–ఏలో కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ బొర్రా ప్రతాప్ రెడ్డి, అతని అన్న కేతిరెడ్డి నాగేశ్వరరెడ్డికి ఒక్కొక్కరికి 4.50 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి ఉంది. అప్పులు ఉండి సుమారు పదేళ్ల క్రితం నాగేశ్వరరెడ్డి 4.50 ఎకరాల వ్యవసాయ భూమిని దిగువపల్లి గ్రామస్తుడు పప్పూర్ గంగిరెడ్డి చిన్న కుమారుడు దామోదర్‌రెడ్డికి అమ్మినాడు. తర్వాత సుమారు ఒక సంవత్సరం నుంచి కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి పొలంలో ఉన్న అరటి పంట కోత ఉన్నప్పుడు పొలంలోకి లారీ వచ్చే దానికి దారి లేదని పప్పూరి గంగిరెడ్డి గొడవపడేవాడు. అందుకు ప్రతాప్‌రెడ్డి ఈ పొలం అన్నదమ్ముల భాగం కనుక దారి ఎందుకు ఉండదని గంగిరెడ్డితో గొడవపడేవాడు. ఫిబ్రవరి నెల 24న ప్రతాప్‌రెడ్డి మోటార్ సైకిల్‌పై తన అరటి తోటలో గల గెలలకు పోట్లు పెట్టుకొనే దానికి ఇంటి దగ్గరి నుంచి మచ్చు కొడవలి తీసుకొని వెళ్లాడు. తోట వద్ద గెలలకు పోట్లు పెట్టుకుంటూ ఉండగా, తోట పక్కన ఉన్న గంగిరెడ్డి ఇంతకుమునుపు ఉన్న పాత కక్షలు మనసులో పెట్టుకొని రేపు నీ తోటలోకి లారీ వస్తే రానీయను, నీకు దారి లేదు అని చెప్పి గొడవ పెట్టుకున్నాడు. అన్నదమ్ముల తోటలో దారి లేకుండా ఎక్కడికి పోతుందని గంగిరెడ్డితో అన్నాడు. అందుకు గంగిరెడ్డి రేపు లారీ ఎట్లా వస్తుందో చూస్తా అన్నాడు. అందుకు ప్రతాప్‌రెడ్డి ఇప్పుడే పోతాను ఏమి చేస్తావు అని, ఇరువురు ఒకరినొకరు తిట్టుకుంటూ తోపులాటకు దిగారు. గంగిరెడ్డిని ప్రతాప్‌రెడ్డి గట్టిగా తోయగా కిందపడి లేచి తన చేతిలో ఉన్న కొడవలిని మీదికి విసిరాడు. ఆ కొడవలి కుడి కాలు మోకాలుకు తగిలింది. ప్రతాప్‌రెడ్డి తన చేతిలో ఉన్న మచ్చు కొడవలితో గంగిరెడ్డి మెడ పైన నరకబోగా.. తన చేయి అడ్డం పెట్టాడు. మళ్లీ మెడ పైన నరకబోగా మరొక చేయి అడ్డం పెట్టాడు. తర్వాత మెడపైన, తల వెనక వైపున నరకగా గంగిరెడ్డి కింద పడిపోయాడు. తర్వాత ప్రతాప్‌రెడ్డి తన మోటార్ సైకిల్‌పై మచ్చుకొడవలితో పారిపోయాడు. అతన్ని పులివెందుల రూరల్ సీఐ కేవీ రమణ శనివారం అరెస్ట్ చేశారు. సమావేశంలో పోలీసు హెడ్‌కానిస్టేబుల్ నూర్ బాషా ఉన్నారు.

పేద.. ఆపై పెద్ద బాధ

- కాటేసిన అగ్నిప్రమాదం
- సర్వం కోల్పోయిన కుటుంబం
- ఆదుకోవాలని వేడుకోలు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు



పూరి గుడిసె ఎదుట నలుగురు ఆడ పిల్లలతో దీనంగా నిరుపేద దంపతులు

పెద్దతిప్పసముద్రం : ఈ నిరుపేద దంపతులకు సెంటు భూమి కూడా లేదు. అయితే దంపతులిద్దరూ కాయ కష్టం చేస్తూ వచ్చిన డబ్బులతో నలుగురు ఆడపిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటూ సంతోషంగా కాలం గడిపేవారు. ఎదుగుతున్న పిల్లలను చూసి పైసా పైసా కూడబెట్టి 22 గ్రాముల బంగారంతోపాటు కొంత నగదు సమకూర్చుకుని ఇంట్లో భద్ర పరిచారు. అయితే నాలుగు రోజుల క్రితం ఈ దంపతుల ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదం వీరి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సంపతికోట దళితవాడకు చెందిన గంగంపల్లి శివన్న, రవనమ్మ దంపతులు. వీరికి నలుగురు ఆడపిల్లల సంతానం. పిల్లలందరూ 15 ఏళ్లలోపు వయసు వాళ్లే. భార్య రవనమ్మ ఇంట్లోనే టైలరింగ్ పని చేసుకునేది. భర్త తన వద్ద ఉన్న పంపులతో రైతుల పొలాల వద్దకు వెళ్లి క్రిమి సంహారక మందులను స్ప్రేయింగ్ చేసే పనికి వెళ్లేవాడు. ఈ దంపతుల కష్టార్జితం డబ్బులతో కుటుంబం సజావుగా సాగేది. ఈ నేపథ్యంలో గత నెల 26న ప్రమాదవశాత్తు ఇంట్లో జరిగిన ఓ అగ్ని ప్రమాదం ఈ కుటుంబాన్ని వీధిన పడేసింది. ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న రూ.30 వేల నగదు, 22 గ్రాముల బంగారు నెక్లెస్, నలుగురు పిల్లల వెండి కాలి గొలుసులతోపాటు వీరు వాలోని దుస్తులు, రిఫ్రిజిరేటర్, మందు కొట్టే స్ప్రేయింగ్ పంపులు, మిక్సీ, వంట పాత్రలు, ఆధార్, రేషన్ కార్డులు, పిల్లల జనన ధ్రువ పత్రాలన్నీ కాలి బూడిద అయ్యాయి. ఈ ఘటనలో బతుకు జీవుడా అంటూ ఈ కుటుంబం కట్టుబట్టలతో బతికి బయట పడ్డారు. ప్రధానంగా పంపులు, టైలరింగ్ మిషన్ మాత్రమే వీరికి జీవనోపాధి. అవి కూడా కాలిపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఈ కుటుంబం లోలోపలే కుమిలిపోతూ దుర్భరంగా కాలం వెళ్లదీస్తోంది. ఇంటి పైకప్పు రేకులు సైతం కాలిపోవడంతో నిలువ నీడ లేక సమీపంలోనే కూలడానికి సిద్ధంగా ఉన్న ఓ పూరి గుడిసెలో ఈ కుటుంబం తల దాచుకుంటోంది. ఎవరైనా వచ్చి ఆపన్నహస్తం అందించి ఆదుకుంటారనే ఆశతో కళ్లకు ఒత్తులు వేసుకుని నిరీక్షిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన రోజు రెవెన్యూ అధికారులు 50 కిలోల బియ్యం మాత్రం అందజేసి చేతులు దులుపుకున్నారే గానీ ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదు. దీంతో వీధిన పడిన కుటుంబంలోని నలుగురు చిన్నారుల దుస్థితి చూసి చలించిపోయిన పలువురు గ్రామస్తులు ఆహారం వండుకునేందుకు వంట పాత్రలు, కూరగాయలు, కొంత మంది వ్యక్తులు వారికి తోచిన నగదు సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అగ్ని ప్రమాద నష్ట పరిహారం మంజూరయ్యేలా, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమయ్యే ధ్రువ పత్రాలను త్వరితగతిన వచ్చేలా అధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వం తమ కుటుంబ జీవనోపాధి కోసం ఆర్థిక సహాయం అందజేయాలని నిరుపేద దంపతులు కోరుతున్నారు.

అంగళ్లులో దొంగల స్వైర విహారం

- వరుసగా ఏడు దుకాణాల్లో చోరీ

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లు కూడలి ప్రాంతంలో.. అదీ హైవే పక్కనే ఉన్న వివిధ వాణిజ్య షాపులపై శుక్రవారం రాత్రి దొంగలు స్వైర విహారం చేశారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి రెండున్నర గంటల వరకు తెగబడ్డారు. తొలుత వరుసగా ఐదు షాపుల్లో చోరీ చేశారు. ఆ తర్వాత సబ్ స్టేషన్ సమీపంలో మరో రెండు షాపుల్లోకి చొరబడి దొంగలించారు. రూ.రెండున్నర లక్ష విలువ చేసే సామగ్రి, రూ.పది వేలు నగదు చోరీ జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. దొంగల స్వైర విహారం చూస్తే ముదివేడు పోలీసులకు సవాల్ విసిరినట్లుగా ఉంది. అంగళ్లులోని ఓపీ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఈ చోరీలు జరగడం గమనార్హం. విలువైనవి పోకున్నా నిత్యం రద్దీగా ఉండే అంగళ్లులో అదీ హైవే పక్కనే ఈ చోరీలు జరగడం సంచలనాన్ని కల్గిస్తోంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అంగళ్లు సర్కిల్‌కు సమీపంలో కడప రోడ్డును ఆనుకుని శెట్టి సీతారాంరెడ్డి కాంప్లెక్స్ ఉంది. ఇక్కడ వరుసగా నాలుగు షాపుల్లో చోరీ చేశారు. షాపులకు పైనున్న రేకును కత్తిరించి లోనికి ప్రవేశించారు. అక్కడ శెట్టి కేశవరెడ్డికి చెందిన షాపులో రూ.30 వేల విలువ చేసే ట్యాబ్, ఫ్యాన్ దొంగలించారు. ఈ సంఘటన సీసీ పుటేజీలో కన్పిస్తోంది. ఈ షాపులకు అటు ఇటు ఉన్న షాపుల్లో 25 వేల విలువ చేసే కటింగ్, డ్రిల్లింగ్ మిషన్లు ఎత్తుకెళ్లారు. మరో షాపులో రూ.15 వేల విలువ చేసే వైరు ఎత్తుకెళ్లారు. ఈ షాపులకు ఎదురుగా ఉన్న ఎస్.రెడ్డిశేఖర్‌రెడ్డికి చెందిన మోటార్ రివైండింగ్ షాపులో రూ.లక్ష 30 వేలు విలువ చేసే కాపర్ వైరు, మోటార్లకు అమర్చే బుష్‌లు ఎత్తుకెళ్లారు. ఆఖరులో సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న గోపాలపురంరెడ్డి ప్రసాద్ షాపుల్లో రూ.26 వేల విలువ చేసే మల్చింగ్ పేపర్, మరో రూ.10 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అన్ని షాపులకు పైనున్న రేకును కత్తిరించి లోనికి ప్రవేశించి చోరీ చేశారు. రాత్రి 12 గంటల నుంచి రెండున్నర గంటల పాటు అంగళ్లులో దొంగలు స్వైర విహారం చేసినట్లు సీసీ పుటేజీల ఆధారంగా వెల్లడవుతోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

‘సూపర్ సిక్’ అయిన పథకాలు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గత ఎన్నికల సందర్భంగా సంక్షేమ పథకాలపై హామీలు గుప్పించి అధికార పీఠంపై కూర్చున్న చంద్రబాబు నాయుడు.. ఇప్పటి వరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. తాజా బడ్జెట్ అంచనాలే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. దొరసానిపల్లెలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు ప్రతి నెల రూ.1500 ఇస్తామని ప్రకటించి అమలు చేయలేదన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అంత వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు చెల్లిస్తామని ప్రకటించారన్నారు. ఇంత వరకు కనీసం 20 మందికి ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఉన్న పింఛన్లకు సంబంధించి రూ.32 వేల కోట్లు కావాల్సి ఉండగా కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారన్నారు. దీపం పథకానికి సంబంధించి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు ఒక్క సిలిండర్ చొప్పున మాత్రమే ఇచ్చారన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు కాకుండా అదనంగా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారన్నారు. అయితే ఇప్పటి వరకు ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆరోగ్య ఆసరా పథకం అమలు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో ఏడాది అని, ఇప్పుడు కూడా సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతే ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఉద్యోగులదీ అదే పరిస్థితి

డీఏలకు సంబంధించి అరియర్స్, పీఆర్సీ బకాయిలు చెల్లిస్తామని ఉద్యోగులను నమ్మించిన చంద్రబాబు ఇప్పటి వరకు వారి ఎలాంటి చెల్లింపులు చేయలేదని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ వేతనాలు అందకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, నూకా నాగేంద్రారెడ్డి, సత్యం, పాతకోట మునివంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలుకు కేటాయింపులెక్కడ?

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : హామీల అమలుకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. రాయచోటిలో ఆయన శనివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు అంటూ కూటమి ప్రభుత్వం చేసిన దుష్ప్రచారం బడ్జెట్ లెక్కల సాక్షిగా బయట పడిందన్నారు. బడ్జెట్ అంచనా వ్యయం రూ.3,22,359 కోట్లు, రెవెన్యూ రాబడి రూ.2,17,976 కోట్లు, అప్పు రూ.1,04,382 కోట్లుగా చూపించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి సందర్భంలోనూ గత ప్రభుత్వం అంటూ వైఎస్సార్ సీపీపై దూషణాలకు పాల్పడుతోందన్నారు. సంపద దృష్టి అంటూ చంద్రబాబు ప్రచారం చేసుకుంటురని, పది నెలల్లో మైనస్ 0.01 శాతం వృద్ధిలో ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి పాలన చేతకాదన్న మీరు పది నెలల్లో సాధించిన అభివృద్ధి శూన్యం అన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు చూస్తే ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. తాజా బడ్జెట్‌లో వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఎక్కడా రైతులను ఆదుకోవడం లేదన్నారు.